
సాక్షి నిర్మల్

బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



ఓటరు చైతన్యమే లక్ష్యంగా..

ఓటింగ్ శాతం పెంపునకు ఎన్నికల కమిషన్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఓటేసే పద్ధతిపై అవగాహన కల్పించేందుకు గైడ్ రూపొందించింది. IIలో ▸



ముస్తాబైన రామాలయాలు

శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని రామాలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. అంతటా రామనామం మార్మోగుతోంది. IIIలో ▸

గరిష్టం/కనిష్టం
41.4 /28.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండవేడి అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రాముని శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు

నిర్మల్‌టౌన్: శ్రీరామనవమి పురస్కరించుకుని నిర్మల్, భైంసాలో బుధవారం నిర్వహించే శ్రీరాముని శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో నిర్మల్, భైంసాలో బందోబస్తు నిర్వహించే పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వారికి కేటాయించిన విధులను తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. సంయమనం పాటిస్తు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సమయస్ఫూర్తితో నడుచుకోవాలని వివరించారు. ట్రాఫిక్ నియంత్రణ విషయంలో అప్రమత్తంగా ఉంటూ.. శోభాయాత్రకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్మల్, భైంసాలో నిర్వహించే శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి కూలీలతో డీఆర్డీవో విజయలక్ష్మి

కడెం: ఉపాధిహామీ పని ప్రదేశంలో జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి కూలీలకు సూచించారు. మండలంలోని లింగాపూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేయాలని, నీడ కోసం టెంటు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని వివరించారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డీఆర్డీవో వెంట ఏపీవో జయదేవ్, టీఏ గణేశ్, ఎఫ్‌ఏలు రాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న గ్రామాల తరలింపు



తరలింపు పనులు పర్యవేక్షిస్తున్న ఎఫ్‌ఆర్వో

కడెం: కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల తరలింపు ప్రక్రియ మంగళవారం కొనసాగింది. రెండో రోజు మరో పది కుటుంబాలను కొత్తమద్దిపడగ సమీపంలోని పునరావాస కాలనీకి తరలించామని ఎఫ్‌ఆర్వో అనిత తెలిపారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి



మాట్లాడుతున్న మురళీమనోహర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.మురళీమనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. ఎన్నికల సంఘం ప్రత్యేక అనుమతితో ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులను, దివ్యాంగులను, గర్భిణులను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్‌ఖాన్, గౌరవ అధ్యక్షుడు ఎం.పరమేశ్వర్‌రెడ్డి, కోశాధికారి పోల ధర్మరాజ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో డెత్ బెల్స్!

- కొనసాగుతున్న ఆత్మహత్యలు
- ఐదు నెలల్లో ముగ్గురు విద్యార్థుల బలవన్మరణం
- అందరూ ఉన్నా.. అనాథలా క్యాంపస్ పరిస్థితి
- సమస్యలు చెప్పుకునే పరిస్థితే లేని వైనం..
- భరోసా ఇవ్వాల్సిన వారే భయపెడుతున్నారా?



భైంసా: తెలంగాణలోనే ప్రతిష్టాత్మకమైన బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) ఆత్మహత్యలకు కేరాఫ్‌గా మారుతోంది. రాజస్థాన్‌లో కోటా తర్వాత విద్యార్థుల ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నది ఇక్కడే. మంగళవారం మరో విద్యార్థి ఉరేసుకుని ఉసురు తీసుకున్నాడు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన బుచ్చుక అరవింద్ హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. పీయూసీ-2 చదువుతున్న అరవింద్ ఇటీవలే ఇంటికి వెళ్లి ఈనెల 12న క్యాంపస్‌కు తిరిగి వచ్చాడు. హాజరు శాతం తక్కువగా ఉందని పరీక్షలకు అధికారులు అనుమతించకపోవడంతో మనస్తాపం చెందిన అరవింద్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. గడిచిన ఐదు నెలల్లో ముగ్గురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

ఇప్పటికీ చిన్నచూపే...

2008లో ప్రారంభమైన ఆర్జీయూకేటీ ప్రభుత్వాలు ఇప్పటికీ చిన్నచూపే చూస్తున్నాయి. పేదింటి పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దే విద్యాక్షేత్రంపై ఎవరూ దృష్టిపెట్టడంలేదు. ప్రతిష్టాత్మక క్యాంపస్‌లో పాలన పూర్తిగా గాడితప్పుతోంది. ఇప్పటికీ ఇన్‌చార్జి వీసీతోనే పాలన కొనసాగిస్తున్నారు. క్యాంపస్‌లో బాధ్యతలన్నీ డీన్‌లకే అప్పగించి అంతా చేతులు దులుపుకున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఘటనలపై మండిపడిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అధికారంలో ఉన్నారు. కానీ, బాసర పరిస్థితి మాత్రం ఏమీ మారలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

స్థానికంగా ఉన్నతాధికారులు..

ఇక బాసర ఆర్జీయూకేటీలో సమస్యలు లేకుండా చూడాలని గత ప్రభుత్వంలో నియమించిన ఉన్నతాధికారులంతా స్థానికంగా ఉండడం లేదు. హైదరాబాద్‌లో ఉంటూ ఫోన్‌లో, ఆన్‌లైన్‌లో వ్యవస్థలను నడిపిస్తున్నారు. ఇక్కడి విద్యార్థులను, వారి సమస్యలను ఎవరూ పట్టించుకోవడంలేదు. ఏడాదిన్నర క్రితం ఆర్జీయూకేటీ విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం తీవ్ర ఆందోళనలు చేశారు. సమస్యలపై రాజీలేని పోరాటం చేయగా నాటి ప్రభుత్వం అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి క్యాంపస్‌కు పంపించి విద్యార్థులతో చర్చలు జరిపించింది. సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రితో హామీ ఇప్పించారు. రెండేళ్లు కావొస్తున్నా ఇప్పటికీ ఆ సమస్యలు పరిష్కారం కాలేదు. అప్పట్లో పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి పోలీసు భద్రతను ఛేదించుకుని గోడ దూకి క్యాంపస్‌లోకి వెళ్లారు. అయితే పోలీసులు అదుపులోకి తీసుకుని విద్యార్థులను కలవకుండానే పంపించి వేశారు. ప్రస్తుతం సీఎం అయిన రేవంత్‌రెడ్డి ఆర్జీయూకేటీపై దృష్టిపెట్టాలని నాలుగు నెలలుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కానీ, సీఎం కనీసం సమీక్ష చేయకపోవడం గమనార్హం. దీంతో పట్టింపులేని అధికారుల పర్యవేక్షణలో, జైలును తలపించే నిబంధనల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారు. వారి గోస బయటకు రావడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ట్రిపుల్‌ఐటీలో ఏం జరుగుతుందో తెలుసుకుని విద్యార్థుల ఆత్మహత్యలకు అడ్డుకట్టవేయాలని అంతా కోరుతున్నారు.



నిర్మల్ ఆస్పత్రిలో అరవింద్ మృతదేహం

బెదిరింపే ప్రాణం తీసిందా..?

పీయూసీ-2 చదువుతున్న అరవింద్ హాజరు శాతం తక్కువ ఉందని, పరీక్షలకు అనుమతించబోమని అధికారులు ఇటీవల బెదిరించినట్లు తెలుస్తోంది. ఇటీవలే హాజరుశాతం తక్కువగా ఉన్న విద్యార్థుల జాబితాను అధికారులు రూపొందించినట్లు సమాచారం. హాజరుశాతం తక్కువ ఉందని పరీక్షలకు అనుమతించకపోవడంతోపాటు వారిని క్యాంపస్ నుంచి పంపించాలని అధికారులు ఈ జాబితాను సెక్యూరిటీ సిబ్బందికి అందించారు. ఈ క్రమంలో జాబితాలో పేర్లు ఉన్న విద్యార్థులను సెక్యూరిటీ సిబ్బంది పిలిపించి క్యాంపస్ ఖాళీ చేయాలని హుకూం జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అరవింద్‌ను కూడా బెదిరించినట్లు సమాచారం. ఈ క్రమంలో పరీక్షలు రాయలేకపోతున్నానని మదన పడిన అరవింద్ తన బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక, క్యాంపస్ విడిచి వెళ్లలేక తనలో తానే కుమిలిపోయాడని చెబుతున్నారు. మానసిక ఒత్తిడితో చివరకు ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై క్యాంపస్ అధికారులు స్పష్టత ఇవ్వడంలేదు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతున్నారు.

భైంసాలో నేడు శోభాయాత్ర



కవాతులో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ రాజారెడ్డి

భైంసాటౌన్: శ్రీరామ నవమి సందర్భంగా హిందూ వాహిని మహిషా శాఖ ఆధ్వర్యంలో భైంసా పట్టణంలో శ్రీరాముడి శోభాయాత్ర బుధవారం నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు శోభాయాత్ర ప్రారంభం కానుంది. స్థానిక గోశాల నుంచి పురాణాబజార్, గణేశ్‌నగర్, కుభీర్‌రోడ్డు(కోతిదేవుడు), పద్మావతి కాలనీ, మున్సిపల్ చౌరస్తా, బస్టాండ్ రోడ్డు, నిర్మల్ చౌరస్తా, రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు మీదుగా రాంలీలా మైదానం వరకు యాత్ర సాగుతుంది. శోభాయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని హిందూవాహిని నాయకులు కోరారు. ఈ నేపథ్యంలో పోలీసుశాఖ బందోబస్తు చర్యలు చేపట్టింది. ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పట్టణంలో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. దాదాపు 300 మందితో బందోబస్తు నిర్వహిస్తామని ఏఎస్పీ తెలిపారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

భైంసాటౌన్: పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సూచించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించనున్న శోభాయాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ డి.రాజారెడ్డి, ఎస్సైలు ఉన్నారు. అంతకుముందు పట్టణ సీఐ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావుతో కలిసి పట్టణంలో శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు.

బీఆర్‌ఎస్‌కు ముగ్గురు కౌన్సిలర్ల రాజీనామా

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 25వ వార్డుల కౌన్సిలర్లు అడుముల్ల రమాదేవి, ఎడిపెల్లి నరేందర్, బిట్లింగ్ నవీన్ మంగళవారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. తమ రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపినట్లు తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

విద్యార్థి ఆత్మహత్యపై నివేదిక కోరిన కలెక్టర్

- ఎస్పీతో కలిసి వర్సిటీ అధికారులతో సమావేశం
- ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని ఆదేశం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యకుపాల్పడ్డ విద్యార్థి బుచ్చుక అరవింద్ ఘటనకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వర్సిటీ అధికారులను ఆదేశించారు. ఎస్పీ జానకీషర్మిలతో కలిసి బాసర ట్రిపుల్‌ఐటీకి వెళ్లారు. అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. విద్యార్థి ఆత్మహత్య బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కావొద్దని ఆదేశించారు. గతంలో జరిగిన ఘటనలు, తీసుకున్న చర్యలపైనా నివేదికలు అందజేయాలన్నారు. వర్సిటీలో కౌన్సెలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. 60 నుంచి 65 మంది విద్యార్థులతో ఒక బృందం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ బృందాలకు ఒక ఫ్యాకల్టీని కేటాయించి విద్యార్థులను కలుసుకుని వారి సమస్యలు తెలుసుకుని, కౌన్సెలింగ్ నిర్వహిస్తూ పరిస్థితిని తెలుసుకోవాలని వివరించారు. హాస్టల్ కారిడార్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యావేక్షించాలని ఆదేశించారు. మానసిక ఒత్తిడిని జయించేలా విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు ఉండే హాస్టల్ గదులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. సమీక్షలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, క్యాంపస్‌లోని ఆయా విభాగాల అధికారులు మహేశ్, చంద్రశేఖర్, పావని, వినోద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ అధికారులు

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

- మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్‌ఎస్ టీ), వీడియో వీవింగ్ టీం(వీవీటి), స్టాటిస్టిక్స్ సర్వేలయిన్స్ టీం (ఎస్‌ఎస్‌టీ)లకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ఓటర్లను ప్రలోభపెట్టే వాగ్దానాలు ఎన్నికల సంఘం చట్టాలకు విరుద్ధమని, వాటిని నియంత్రించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరూ పార్టీలకు అనుకూలంగా కార్యక్రమాల్లో పాల్గొనరాదని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో పార్టీల అనుకూల, వ్యతిరేక పోస్టులు పెట్టరాదన్నారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి ఎటువంటి ప్రచార కార్యక్రమాలకు అనుమతించొద్దని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో పార్టీల ప్రచారం నిషేధమన్నారు. రాత్రి 10 గంటలు దాటితే ఎన్నికల ప్రచారం చేయవద్దని, సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. అనంతరం సీవిజిల్ యాప్‌పై, ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950పై అధికారులకు ఈడీఎం నదీమ్ అవగాహన కల్పించారు. సీవిజిల్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఖచ్చితంగా వంద నిమిషాల్లో పరిష్కరించేలా ఉండాలన్నారు. వాహనాల తనిఖీల సమయంలో పట్టుబడ్డ నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో డీఎల్ ఎంటీలు శ్రీనివాస్, ఎఫ్‌ఎస్‌టీలు, వీవీటీలు, ఎస్‌ఎస్‌టీలు, అధికారులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్

ఈవీఎంల తరలింపులో జాగ్రత్త వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఈవీఎంల తరలింపులో జాగ్రత్త వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ర్యాండమైజేషన్ పూర్తయిన ఈవీఎం యంత్రాలను సెగ్రిగేషన్ ప్రక్రియ పూర్తిచేసి నియోజకవర్గాల వారీగా అందించామని తెలిపారు. నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల్లో ఈవీఎం యంత్రాల సంఖ్య ప్రకారం స్ట్రాంగ్‌రూమ్‌లలో జాగ్రత్తగా భద్రపర్చాలని అధికారులను ఆదేశించారు.

సీఎమ్మార్ త్వరగా అప్పగించాలి

కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్)త్వరగా అప్పగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మిల్లర్లు, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సీఎమ్మార్ సరఫరా, లక్ష్యాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సకాలంలో సీఎమ్మార్ అప్పగించేలా మిల్లింగ్ నిరంతరం కొనసాగించేలా చూడాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేసే మిల్లులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. అనంతరం మిలర్ల వారీగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎమ్మార్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్‌వో నందిత, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

- జాతీయస్థాయిలో సత్తా చాటిన ఆదిలాబాద్ జిల్లా వాసులు
- మెరిసిన విశాల్, సందీప్, శుభం

'సివిల్స్'లో మనోళ్లు

గమ్యం చేరే దాకా లక్ష్యాన్ని వీడలేదు. అకుంఠిత దీక్షతో చదివి విజయతీరాలకు చేరువయ్యారు. తొలిప్రయత్నంలోనే మెరిసింది ఒకరైతే.. అలుపెరగని పోరాటం మరో ఇద్దరిది. ఇలా ఆ ముగ్గురూ సివిల్స్‌లో సత్తా చాటారు. ఆదిలాబాద్ జిల్లా పేరును జాతీయస్థాయిలో మారుమోగించారు. వారే ఆదిలాబాద్ రూరల్ మండలానికి చెందిన ఆరె విశాల్, ఇంద్రవెల్లి మండలానికి చెందిన శుభం, జిల్లా కేంద్రానికి చెందిన ఆదా సందీప్.

తొలిప్రయత్నంలోనే సత్తా



కుటుంబ సభ్యులతో సందీప్

ఆదిలాబాద్‌టౌన్: యూపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన ఆదా సందీప్ సత్తా చాటాడు. తొలి ప్రయత్నంలోనే 830వ ర్యాంకు సాధించాడు. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామానికి చెందిన ఆదా వెంకటేశ్-వాణి దంపతులు ప్రస్తుతం పట్టణంలోని రవీంద్రనగర్‌లో స్థిరపడ్డారు. వారి చిన్న కుమారుడైన సందీప్ ఐదో తరగతి వరకు పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్‌లో, ఆరు నుంచి పది వరకు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని నవోదయలో చదివాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని గాయత్రీ కళాశాలలో పూర్తి చేశాడు. జేఈఈ మెయిన్స్‌లో 550వ ర్యాంకు సాధించాడు. బీహార్ రాష్ట్రంలోని ధన్‌బాద్ ఐఐటీ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాడు. తర్వాత బెంగుళూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. గతేడాది ఉద్యోగాన్ని వదిలేశాడు. హైదరాబాద్‌లో సివిల్స్‌కోసం ఆన్‌లైన్ శిక్షణ పొందుతున్నాడు. తొలి ప్రయత్నంలోనే ఈ ర్యాంకు సాధించాడు. అయితే ఐఏఎస్ తన లక్ష్యమని, సాధించే వరకు అలుపెరగకుండా శ్రమిస్తానని సందీప్ పేర్కొన్నాడు. తల్లిదండ్రులు, కుటుంబీకుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంకు సాధించినట్లుగా తెలిపాడు. కాగా, సందీప్ తండ్రి ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్ ఖరగ్‌పూర్‌లో ఐఐటీ పూర్తి చేసి ప్రస్తుతం యూఎస్‌ఏలో ఉద్యోగం చేస్తున్నాడు. సందీప్ మెరుగైన ర్యాంకు సాధించడంపై ఆయన తల్లిదండ్రులు, కుటుంబీకులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడో ప్రయత్నంలో విశాల్ సక్సెస్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన ఆరె వెంకటేశ్వర్లు-వనమాల దంపతుల కుమారుడు విశాల్ యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో సత్తా చాటాడు. తండ్రి వెంకటేశ్వర్లు ప్రస్తుతం జైపూర్‌లో ఏసీపీగా కొనసాగుతున్నారు. వృత్తి రీత్యా తండ్రి పోలీస్ ఉద్యోగంలో బిజీగా ఉండడంతో పిల్లల చదువు, బాగోగులు తల్లి చూసుకుంటుంది. విశాల్ పదో తరగతి వరకు మెదక్ జిల్లా తుఫ్రాన్ రెసిడెన్షియల్ పాఠశాలలో, ఇంటర్ నారాయణ కళాశాలలో చదివాడు. ఐఐటీలో 1,600 ర్యాంకు సాధించి ఉత్తరాఖండ్‌లోని రూర్కి ఇంజినీరింగ్ కళాశాలలో 2020లో బీటెక్ పూర్తి చేశాడు. సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్న విశాల్ మూడో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 718వ ర్యాంకు సాధించాడు.



తల్లిదండ్రులతో విశాల్

ఇంటి వద్దే ఉండి చదివా..

మా గ్రామంలో సివిల్స్ తప్ప ఇతర అన్ని ఉద్యోగాలు సాధించిన వారున్నారు. అందుకే సివిల్స్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. రెండు సార్లు విఫలమయ్యాను. ఈసారి ఇంటి వద్ద ఉంటూనే ప్రతీరోజు 12 నుంచి 14 గంటలు చదివా. ఇతర నోట్స్‌తోపాటు తరచూ ఆన్‌లైన్ క్లాసులు విన్నా. - విశాల్

నాలుగోసారి.. 'శుభం'

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన రేకుల్‌వార్ శుభం యూపీఎస్సీ ఫలితాల్లో 790 ర్యాంక్ సాధించి ఈ ప్రాంత సత్తా చాటాడు. జర్నలిస్ట్ రేకుల్‌వార్ సత్యనారాయణ-గీత దంపతులకు నిలేశ్, నికిలేశ్, శుభం ముగ్గురు సంతానం. శుభం 1నుంచి ఐదో తరగతి వరకు మండలకేంద్రంలోని ప్రతిభ పాఠశాలలో, 6 నుంచి 10వ తరగతి వరకు కాగజ్‌నగర్‌లోని నవోదయలో, ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. గౌహతి ఐఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో నాలుగేళ్లుగా తీవ్రంగా కృషి చేస్తున్నాడు. మూడుసార్లు మంచి ర్యాంకు సాధించలేకపోయినా పట్టువదలకుండా చదివి నాలుగోసారి లక్ష్యాన్ని సాధించాడు. రెండేళ్లుగా ఢిల్లీలోని విజన్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. ఈ సారి 790 ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు సంబరాల్లో మునిగారు.



కుటుంబ సభ్యులతో శుభం

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాంద: ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య మహిళ శిబిరాన్ని మంగళవారం సందర్శించారు. ప్రతీ మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు వచ్చే క్యాన్సర్, రక్తహీనత వంటి వ్యాధులతోపాటు గర్భిణులకు వచ్చే అన్ని రకాల సమస్యలకు చికిత్స చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో 11 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఇద్దరిని జిల్లా కేంద్రంలోని మెటర్నిటీ ఆసుపత్రికి సిఫారసు చేశామని డాక్టర్ ప్రత్యూష తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న రాజేందర్

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కుంటాల: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని ఓలా, మెదన్‌పూర్, అంబుగామ గ్రామాల్లోని మంచినీటి పథకాలను మంగళవారం పరిశీలించారు. బోరుబావులు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి ఆదాయ వనరులు ఎంచుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలన్నారు. నర్సరీలు, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీపీవో వెంట ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, గ్రిడ్ ఏఈ కమల్‌సాయి ఉన్నారు.



బోరు బావిని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

క్లుప్తంగా

రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం వాహనంతో ఎస్సై

ఖానాపూర్‌: పట్టణంలోని కుమురంభీం చౌరస్తా నుంచి వేకువజామున డీసీఎం వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 50క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. మంగళవారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. బ్లూకోల్ట్స్‌, పెట్రోకార్‌ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న మహీంద్ర మినీ డీసీఎం వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న 50క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న కడెం మండలం నర్సింగాపూర్‌ గ్రామానికి చెందిన సంగ వెంకటేశ్‌, గొల్ల జలపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపద్బాంధవుడు



రక్తదానం చేస్తున్న హరికృష్ణ

సారంగాపూర్‌: మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన కట్కం హరికృష్ణ అనే యువకుడు ఆపదలో ఎవరు రక్తం అడిగినా వెంటనే స్పందిస్తాడు. మంగళవారం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రమీలకు బీ పాజిటివ్‌ రక్తం అవసరం కాగా, సమాచారం అందుకున్న హరికృష్ణ వెంటనే ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశాడు. తాను 37 ఏళ్లలో 30సార్లు రక్తదానం చేసినట్లు తెలిపాడు. ప్రమీల కుటుంబ సభ్యులు హరికృష్ణకు ధన్యవాదాలు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



దినేశ్‌ (ఫైల్‌)

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన బాలేరావ్‌ దినేశ్‌ (23) మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సందీప్‌ తెలిపిన వివరాల ప్రకారం.. దినేశ్‌ తండ్రి దిగాంబర్‌, తల్లి రేణుకాబాయి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌ వెళ్లి మంగళవారం తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు తీసి చూడగా దినేశ్‌ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సందీప్‌ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.

ఓటరు చైతన్యమే లక్ష్యంగా...



అవగాహన కల్పిస్తున్న మాస్టర్‌ట్రైనర్‌ అరవింద్‌ (ఫైల్‌)

- అవగాహన కోసం 'ఓటరు గైడ్‌'
- ఓటేసే పద్ధతి, వివరాలు ముద్రణ
- విస్తృత ప్రచారం దిశగా కసరత్తు
- బీఎల్వోలతో ఇంటింటికీ పంపిణీ
- ఓటింగ్‌శాతం పెంపే ప్రధానోద్దేశం

నిర్మల్‌ఖిల్లా: ఓటింగ్‌ శాతం పెంపునకు వినూత్న పద్ధతులతో ముందుకెళ్తున్న ఎన్నికల కమిషన్‌ ఈ దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఓటేసే పద్ధతిపై అవగాహన కల్పించేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా నూతనంగా ఓటరు గైడ్‌ రూపొందించింది. ఇందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఇటీవలే విడుదల చేసింది. త్వరలోనే బీఎల్వోల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. పార్లమెంట్‌ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు పెంచేందుకు భారత ఎన్నికల కమిషన్‌ అనేక చర్యలు తీసుకుంటోంది. యువ ఓటర్ల నమోదుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించింది. అర్హులైన పౌరులందరినీ పోలింగ్‌ బూత్‌వైపు నడిపించేందుకు పలు చైతన్య కార్యక్రమాలు అమలు చేస్తోంది. కరపత్రాలు, వాల్‌ పోస్టర్లు, కళాజాత బృందాలు, సినిమా థియేటర్లలో అడ్వర్‌టైజ్‌మెంట్లు, సోషల్‌ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఈసారి ఇందుకు భిన్నంగా 100 శాతం ఓటింగ్‌ లక్ష్యంగా ఓటరు గైడ్‌కు రూపకల్పన చేసింది. బూత్‌ లెవల్‌ అధికారుల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయాలని నిశ్చయించింది.



ఓటరుగైడ్‌ ద్వారా చైతన్యం కల్పిస్తున్న బీఎల్వో (ఫైల్‌)

ఓటు వినియోగంపై అవగాహన

జిల్లాలోని ఓటర్లకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు తనదైన శైలిలో షార్ట్‌ వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. 5–10 నిమిషాల నిడివి గల ఈ వీడియోల్లో ఓటు వినియోగంపై తన బాధ్యత గుర్తెరిగి ప్రతీ ఓటరు ఓటేసే విధానాన్ని తెలుసుకునే అవకాశముంది. ఇదివరకే ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు తొలివిడత శిక్షణ పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఈ వీడియోలు ప్రతీ ఎన్నికల సిబ్బంది, పౌరులు చూసి ఓటు బాధ్యత తెలుసుకోవాలని వివరించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఇప్పటికే జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తొలివిడత శిక్షణ పూర్తయింది. వందశాతం ఓటింగే లక్ష్యంగా పార్లమెంట్‌ ఎన్నికల్లో ప్రతీ పౌరుడు ఓటు వినియోగించుకునేలా జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌, స్వీప్‌ నోడల్‌ అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటికీ ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. మరోవైపు ఓటరు గైడ్‌ ప్రతీ ఇంటికి చేరేలా కార్యాచరణ రూపొందించాం. జన సమూహం కలిగిన ప్రాంతాల్లో ఓటరు చైతన్యానికి వాల్‌ పోస్టర్లు వేయిస్తున్నాం. కరపత్రాల పంపిణీకీ కసరత్తు చేస్తున్నాం.

– రవీందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల సిబ్బంది శిక్షణ నోడల్‌ అధికారి

ఓటరు గైడ్‌లోని ముఖ్యాంశాలు

16 పేజీలతో కూడిన ఓటరు గైడ్‌లో ఓటు వినియోగంపై అవగాహనకు పలు అంశాలు చేర్చింది. ఓటు రిజిస్ట్రేషన్‌ ద్వారా ఓటరు జాబితాలో తమ పేర్ల పరిశీలన, పోలింగ్‌ రోజు అనుసరించాల్సిన పద్ధతులు, పోలింగ్‌ స్టేషన్‌ గుర్తింపు, పోలింగ్‌ బూత్‌లోకి వెళ్లాల్సిన తీరు, ఓటు వేసేందుకు సంబంధిత అధికారులకు చూపాల్సి న గుర్తింపు కార్డుల వివరాలు, ఓటు వేసే విధానంపై అవసరమైన సమాచారం ఓటరు గైడ్‌లో పొందుపర్చారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించినా, సమాచారం అందినా, బాధ్యత గల పౌరుడిగా ఈసీకి ఫిర్యాదు చేసేందుకు పలు సంకేతాలతో కూడిన ఆన్‌లైన్‌ యాప్‌ల వివరాలు కూడా బుక్‌లెట్‌లో చేర్చారు. ఓటు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపే దివ్యాంగులు, సీనియర్‌ సిటిజన్ల కోసం కల్పించిన సౌకర్యాలు ర్యాంప్‌, వీల్‌చైర్‌, బ్రెయిలీ లిపితో కూడిన ఈవీఎంలు, ప్రత్యేక వలంటీర్లు, రవాణా సదుపాయాలు, ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం, పోస్టల్‌ బ్యాలెట్‌ వి ధానంతోపాటు ఓటర్ల ప్రతిజ్ఞ కూడా ముద్రించారు. వీటిని నోటిఫికేషన్‌కు ముందే ప్రతీ ఇంటికి చేర్చేలా బూత్‌స్థాయి అధికారుల ద్వారా ప oపిణీ చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సంస్కృతిని చాటిచెప్పడం అభినందనీయం



సమితి అధ్యక్షుడిని సన్మానిస్తున్న ప్రణవానందదాస్‌

ఆదిలాబాద్‌టౌన్‌: హిందూ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు పండగ ప్రాశస్త్యం తెలియజేసేలా సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అంతర్జాతీయ ఆధ్యాత్మిక ప్రవచనకర్త ప్రణవానంద దాస్‌ పేర్కొన్నారు. ఇస్కాన్‌ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక మధుర జిన్నింగ్‌లో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్‌కుమార్‌ ఖత్రి, గేడం మాధవ్‌, ఉపాధ్యక్షుడు రేణికుంట్ల రవీందర్‌, సభ్యులు తదితరులను శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ తరానికి పండుగల విశిష్టతతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే హిందూ పండుగల నేపథ్యంలో ఇస్కాన్‌ సంస్థ సనాతన హిందూ ఉత్సవ సమితితో కలిసి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు ప్రణవానంద దాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్‌ సంస్థ ఆదిలాబాద్‌ ఇన్‌చార్జి ప్రేమ్‌ నర్తనదాస్‌, ప్రతినిధులు గిరివర్‌ దాస్‌, పూర్ణ కృష్ణదాస్‌, మండలేశ్వర్‌ దాస్‌, కోడూరి రాజేందర్‌, ఆదిత్య ఖందేష్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

సంస్మరణ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



సభ నిర్వహణపై చర్చిస్తున్న ఆదివాసీ పెద్దలు

ఇంద్రవెల్లి: జల్‌ జంగల్‌ జమీన్‌ నినాదంతో పోరాడి 1981 ఏప్రిల్‌ 20న జరిగిన ఇంద్రవెల్లి ఘటనలో అమరులైన ఆదివాసీలకు ఘనంగా నివాళులర్పిద్దామని ఆదివాసీ పెద్దలు అన్నారు. మండల కేంద్రంలోని గోండ్‌గూడలో నాలుగు రాయిసెంటర్ల పరిధిలోని గ్రామాల పటేళ్లు, పెద్దలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అమరుల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్‌ 20న నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి పటేల్‌, పెద్దలు తప్పకుండా హాజరుకావాలని కోరారు. గోండ్‌గూడ గ్రామ పటేల్‌ మడావి ఇంటి నుంచి ఇంద్రాదేవి ఆలయానికి చేరుకొని, అక్కడి నుంచి సంప్రదాయ వాయిద్యాలతో అమరవీరుల స్తూపానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్తూపం వద్ద ప్రత్యేక పూజలతో నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేస్లాపూర్‌ రాయిసెంటర్‌ సార్‌మెడి మెస్రం వెంకట్‌రావ్‌, ఆదివాసీ పెద్దలు మడావి ఇంద్రు, కొట్నాక్‌ దేవ్‌షావ్‌, సిడాం భీంరావ్‌, కొడప నగేష్‌, పుర్క బాపూరావ్‌, కొట్నాక్‌ భారిక్‌రావ్‌, జుగ్నాక్‌ భరత్‌, నాగోరావ్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠినచర్యలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్‌

ఇంద్రవెల్లి: గంజాయి సాగు చేసినా, విక్రయించినా, అక్రమంగా తరలించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్‌ హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నిఘా వర్గాల ముందస్తు సమాచారం మేరకు ఉట్నూర్‌ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్‌ బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ముత్నూర్‌ శివారులో జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌ మండలం మంగేల గ్రామానికి చెందిన పడిగేల వెంకటేశ్‌, ధర్మపురికి చెందిన షేక్‌ జావిద్‌ 350 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు. వారిని విచారించగా మెండపల్లి గ్రామానికి చెందిన కనక సోనేరావ్‌, ముత్నూర్‌ గ్రామానికి చెందిన సిర్‌సట్‌ జైవంత్‌ వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో నలుగురిని అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఉట్నూర్‌ సీఐ మొగిలి, ఏఎస్సైలు లక్ష్మణ్‌, భీంరావ్‌, కానిస్టేబుల్‌ అప్సర్‌ తదితరులున్నారు.

యువత చెడు వ్యసనాలు వీడాలి

- ఎస్పీ గౌస్‌ ఆలం
- చిమ్మన్‌గూడిలో ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్‌ ఆలం

సిరికొండ: యువత చెడు వ్యసనాలు వీడి చదువుతో ముందుకు సాగాలని ఎస్పీ గౌస్‌ ఆలం అన్నారు. మండలంలోని చిమ్మన్‌గూడి గ్రామంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామస్తులు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మద్యం, గంజాయి, పేకాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుతో ముందుకు సాగాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గంజాయి, కల్తీకల్లుతో జరిగే అనర్థాలు తెలుపుతూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్‌ బీబీ పాటిల్‌ మాట్లాడుతూ.. సిరికొండ నుంచి వాయిపేట్‌ వరకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలను కేంద్రానికి పంపినట్లు తెలిపారు. అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ఎస్పీ, డీఎఫ్‌వో సాంప్రదాయ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ఉట్నూర్‌ డీఎస్పీ నాగేందర్‌, ఇచ్చోడ సీఐ భీమేష్‌, ఎఫ్‌ఆర్వో గణేశ్‌, సిరికొండ, నేరడిగొండ ఎస్సైలు నవీన్‌, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

సిరికొండ ఠాణాను సందర్శించిన ఎస్పీ

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ గౌస్‌ ఆలం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం నూతన భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఎస్పీ వెంట పోలీస్‌ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా ఇన్వెస్టిగేషన్‌ ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్‌: నేరస్తులకు కచ్చితంగా శిక్షలు పడే విధంగా పరిశోధన నిర్వర్తించాలని ఎస్పీ గౌస్‌ ఆలం అన్నారు. మాదక ద్రవ్యాల నిరోధక చట్టంతో పరిశోధనలు, కోర్టులో చార్జిషీటు దాఖలు చేయడం, నేరస్తులను పట్టుకునే క్రమంలో అనుసరించాల్సిన విధానాలు తదితర అంశాలపై ఇన్వెస్టిగేషన్‌ అధికారులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా శిక్షణతో పాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గంజాయి, కల్తీకల్లు తదితర మత్తు పదార్థాలు సేవించడం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. పదేపదే నేరం చేసే వారిపై ప్రత్యేక కార్యాచరణ ద్వారా శిక్షలు కఠినంగా విధించేలా చార్జిషీట్‌ దాఖలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ కే.సురేందర్‌ రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత–ఆర్టీసీ బాధ్యత



చల్లని నీరు, ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లున్న పెట్టె

నిర్మల్‌ఖిల్లా: ఆర్టీసీ బస్సులో ప్రయాణం శుభప్రదం .. సుఖవంతం అంటూ బస్సుల్లో రాస్తూ ప్రయాణికులను ఆకట్టుకుంటున్న ఆర్టీసీ వేసవిలో ప్రయాణికుల భద్రత తమ బాధ్యతగా భావిస్తోంది. నిర్మల్‌ జి ల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు చల్లని తాగునీరు అందుబాటులోకి తెచ్చింది. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకున్న ఆర్టీసీ అధికారులు వడదెబ్బ, డిహైడ్రేషన్‌కు గురైనవారికి తక్షణ ఉపశమనం కోసం బస్టాండ్‌ ప్రాంతంలో ఓ బాక్సులో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు కూడా ఉంచుతోంది. అక్కడే సూచికబోర్డు ఏర్పాటు చేసింది. అవసరమున్నవారు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్‌ తీసుకుని ఆ పొడిని గ్లాస్‌లో వేసి, చల్లనినీటిలో కలిపి తాగితే డీహైడ్రేషన్‌ నుంచి సాంత్వన పొందేలా చేసిన ఏర్పాట్లపై ప్రయాణికులు సంతృప్తి వ్యక్తంజేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రజనీకాంత్‌

కుంటాల: అందాకూర్‌–కల్లూర్‌ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుభీర్‌ మండల కేంద్రానికి చెందిన బొప్ప రవి (38)కి కుంటాలకు చెందిన ఇందిరతో పదేళ్ల క్రితం వివాహమైంది. రవి భైంసా పట్టణంలో జనరల్‌ స్టోర్‌ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారులు మనీశ్‌, మణికంఠ ఉన్నారు. పెద్ద కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి రవి తన అత్తమ్మను కుంటాలలో వదిలి పెట్టేందుకు రవి ద్విచక్రవాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో అందాకూర్‌ శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టు కింద పడింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం పంట పొలాలకు వెళ్తున్నవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్య ఇందిరకు హైదరాబాద్‌లో ఆపరేషన్‌ చేయించాలని, ఇందుకు అవసరమైన డబ్బులు పోగు చేసుకోగా ఇంతలోనే రవి మృతి చెందడం అందరినీ కంటతడి పెట్టించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రజనీకాంత్‌ తెలిపారు.



బొప్ప రవి (ఫైల్‌)

యువకుడి అదృశ్యం



చవాన్‌ నవీన్‌

మామడ: మండలంలోని కిషన్‌రావుపేట్‌ గ్రామపంచాయతీ పరిధిలో చెరువుముందు తండాకు చెందిన చవాన్‌ నవీన్‌ (20) ఈ నెల 14వ తేదీ నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్‌ గ్రామంలో వ్యవసాయం పనులు చేస్తుంటాడు. మంగళవారం బయటకు వెళ్లగా సెల్‌కు ఎన్నిసార్లు ఫోన్‌ చేసినా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. అతడి ఆచూకీ తెలియకపోవడంతో తల్లి గంగుబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్‌: పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ ఆశిష్‌ సంగ్వాన్‌ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఈద్‌గాం, శివాజీచౌక్‌లోని డ్రైనేజీలను మంగళవారం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని మున్సిపల్‌ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌ యార్డుకు తరలించాలన్నారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లపై చెత్తవేసే దుకాణాలు, హోటళ్లు, మాల్స్‌, ఆస్పత్రుల యజమానులకు జరిమానా విధించాలన్నారు. పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వందశాతం ఆస్తి పన్ను వసూలు చేయాలన్నారు. వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ ఫైజాన్‌ అహ్మద్‌, మున్సిపల్‌ కమిషనర్‌ రాజు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

వడ్డీ వ్యాపారులపై కేసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ భీమేశ్‌ తెలిపారు. మంగళవారం ఆయన సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ గౌస్‌ ఆలం ఆదేశాల మేరకు వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారి ఇళ్లు, కార్యాలయాల్లో సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. పాన్‌పట్టి సురేశ్‌ వద్ద 15 బ్లాంక్‌ చెక్కులు, 500 పాస్‌బుక్కులు, ముక్క రాజు నుంచి ఐదు బ్లాంక్‌ చెక్కులు, ఒక్క బాండ్‌ పేపర్‌, వెలిశాల గణేశ్‌ నుంచి ఐదు పాస్‌ బుక్కులు, ఏడు ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై నరేశ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీసుస్టేషన్‌ పరిధిలోని ఆదిలాబాద్‌ పట్టణం కైలాస్‌నగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్‌ తెలిపారు. కైలాస్‌నగర్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ ఇజ్జగిరి అశోక్‌ గత కొంత కాలంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం తనిఖీలు చేపట్టగా 5 ఫైనాన్స్‌ బుక్‌లు, 18 బ్లాంక్‌ చెక్కులు, 11 బాండ్‌ పేపర్లతోపాటు 26 ప్రామిసరీ నోట్లు, సంతకాలు చేసిన 27 బ్లాంక్‌ పేపర్లు, ఒక మార్టిగేజ్‌ డీడీ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

స్థల వివాదంలో హెడ్‌కానిస్టేబుల్‌పై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: ఓ స్థల వివాదంలో హెడ్‌ కానిస్టేబుల్‌పై టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నెల క్రితం ఓ హెడ్‌కానిస్టేబుల్‌ ఆదిలాబాద్‌ పట్టణంలోని రిక్షా కాలనీలో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. ఇంటి పక్కనున్నవారి కొద్ది స్థలాన్ని ఆక్రమించాడని బాధితులు టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌తో పాటు గ్రీవెన్స్‌ సెల్‌, మున్సిపల్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌కు నోటీసులు జారీ చేశారు. మున్సిపల్‌ సిబ్బంది ఘటనా స్థలానికి రాగా వారిపై దురుసుగా ప్రవర్తించాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించాడని మున్సిపల్‌ అధికారులు టూటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై టూటౌన్‌ సీఐ అశోక్‌ను సంప్రదించగా విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

మహిళల రక్షణకు షీటీమ్స్‌

- ఎస్పీ జానకీషర్మిల



జానకీ షర్మిల, ఎస్పీ

నిర్మల్‌టౌన్‌: మహిళల రక్షణే ప్రధాన లక్ష్యంగా షీటీమ్స్‌ పని చేస్తున్నాయని ఎస్పీ డాక్టర్‌ జానకీషర్మిల తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిలతోగానీ, మరే విధమైన వేధింపులతోగానీ, ఇబ్బందులు ఎదుర్కొన్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని పేర్కొన్నారు. ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో షీటీమ్స్‌కు మార్చిలో 6 ఫిర్యాదులు రాగా, 2 ఎఫ్‌ఐఆర్‌లు బుక్‌ చేసినట్లు తెలిపారు. మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌ నిర్వహించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 130 హాట్‌స్పాట్‌లను విజిట్‌ చేసినట్లు పేర్కొన్నారు. చిన్న పిల్లల రక్షణకు పోలీస్‌ శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ఎవరికైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు షీటీం నంబర్‌ 8712659550 లేదా డయల్‌ 100 కు సంప్రదించాలని తెలిపారు.

బీజేపీతోనే బడుగుల అభివృద్ధి



దేవపూర్‌ ఆలయంలో పూజలు చేస్తున్న నగేశ్‌

తలమడుగు: బడుగుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ అభ్యర్థి జీ నగేశ్‌ పేర్కొన్నారు. పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని దేవాపూర్‌, బరంపూర్‌ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం దేవాపూర్‌ గ్రామంలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగేశ్‌ మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రతీ కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని సూచించారు. అనంతరం దేవపూర్‌లోని హనుమాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందిగామ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ ఉప సర్పంచ్‌ తెలంగరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీనియర్‌ నాయకులు చంద్రకాంత్‌, వెంకట్‌స్వామి, ప్రభాకర్‌, కిరణ్‌, స్వామి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

నిర్మల్‌టౌన్‌: కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏఎన్‌.రెడ్డి కాలనీలో గల క్లబ్‌హౌస్‌లో పార్టీలకు సంబంధం లేకుండా తన వర్గానికి చెందిన 200 మందితో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఏర్పాటు చేసిన పార్లమెంటరీస్థాయి సమావేశానికి వెళ్లకుండా నిర్మల్‌లో అనుచరులతో సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. మొదటగా తన వర్గం నాయుల నుంచి సలహాలు స్వీకరించారు. అనంతరం ఐకే.రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధైర్యం కల్పించారు. వెళ్లిపోయిన నాయకులని చూసి బాధపడొద్దని, ఉన్నవాళ్లే మనోళ్లు అని సూచించారు. వారం రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. సమావేశంలో సీనియర్‌ నాయకులు పాకాల రాంచందర్‌, వెంకటరమణారెడ్డి, ధర్మాజీ రాజేందర్‌, అల్లోల మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, ఒస రాజేశ్వర్‌, గోవర్ధన్‌రెడ్డి, పూదరి సాయికృష్ణ, శ్రీధర్‌, నామెడ గజేందర్‌, రమేశ్‌రెడ్డి, గోనుగొప్పుల నర్సయ్య, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.